

ఫిర్యాదు చేసినా.. ఫలితం లేక..

సైబర్ నేరగాళ్ల బారిన పడిన విషయాన్ని బాధితులు పైకి చెప్పుకోలేక.. పోలీసుస్టేషన్‌కు వెళ్లలేక సతమతమైనవారే అధికమంది ఉన్నారు. కొన్నిరోజుల తర్వాత మోసపోయిన విషయాన్ని గ్రహించి.. తప్పనిసరిలో ఫిర్యాదు చేస్తున్నారు. దీంతో పెద్దగా ఫలితం ఉండట్లేదు. సైబర్ నేరగాళ్లు ఇచ్చిన బ్యాంకు ఖాతాలు.. టెలిగ్రామ్ ఛానళ్లు.. వాట్సాప్ గ్రూపులు.. ఇలా అన్నీ మరొకరి పేరుతో ఉంటున్నాయి. అసలు నేరగాళ్లు వేరు. థర్డ్‌పార్టీ సిమ్‌కార్డులను, బ్యాంకు ఖాతాలను వినియోగిస్తూ మోసాలకు పాల్పడుతున్నారు. కొన్నికేసుల్లో పోలీసులు చర్యలు తీసుకునేందుకు ఆస్కారం లభించడం లేదు. ఇంకొన్ని కేసుల్లో బాధితులు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదుచేస్తే.. డబ్బుకు ఆశపడి ఎలా డిపాజిట్ చేశావు? తెలియని వ్యక్తి రూ.లక్షల్లో డబ్బులిస్తామంటే నువ్వెలా నమ్మావంటూ పోలీసులు ప్రశ్నిస్తున్నారు. దీంతో ఇచ్చిన ఫిర్యాదుపై కూడా బాధితులు ఒత్తిడి తేలేకపోతున్నారు.

ఆశ చూపి.. దోచేసి!

● రూ.299 చెల్లిస్తే.. రూ.2,999 వస్తాయని మభ్యపెట్టి..
● ఒక్కరోజులో లక్షాధికారి కావొచ్చు అంటూ మోసగిస్తూ..
● ఆన్‌లైన్ ట్రేడింగ్‌పేరిట సైబర్ నేరగాళ్ల బరితెగింపు
● ఉచ్చులో పడి డబ్బులు పోగొట్టుకుంటున్న ప్రజలు
● బెట్టింగ్, లోన్ యాప్‌ల్లోనూ చిక్కుకుని ఇబ్బందులు

జిల్లాలో సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. పెరుగుతున్న సాంకేతికతను అనుకూలంగా మలుచుకుని 'స్మార్ట్'గా డబ్బులు దోచేస్తున్నారు. బెట్టింగ్ యాప్‌లు, లోన్‌యాప్‌ల పేరిట ఆశ చూపి.. నిలువునా ముంచేస్తున్నారు. బ్యాంకు ఖాతాలో ఉన్న నగదును కూడా వివిధ రూపాల్లో దోచుకుపోతున్నారు. అమాయకులే కాకుండా.. విద్యావంతులు.. ఉద్యోగులు.. ఉన్నతస్థానంలో ఉన్నవారు కూడా సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడిపోతున్నారు. కొంతమంది బాధితులు పైకి చెప్పుకోలేక.. పోలీసుస్టేషన్‌కు వెళ్లలేక పోతున్నారు. మరికొందరు కొన్నిరోజుల తర్వాత తప్పనిసరి పరిస్థితుల్లో ఫిర్యాదు చేస్తున్నారు.
(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

జిల్లాలో సైబర్ మోసాలు అధికమయ్యాయి. వీటిబారిన పడి రూ.లక్షలు పోగొట్టుకున్న వారు ఎంతోమంది ఉన్నారు. 2022లో ఇలాంటి కేసులు 60 నమోదు కాగా.. 2023లో 40 కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 15 కేసులు నమోదు కాగా.. ఏకంగా రూ.3కోట్లకు పైగా సైబర్ నేరగాళ్లు దోచుకున్నారు. నలుగురికీ సలహాలిచ్చేవారు.. చిన్నప్పటి నుంచి కష్టార్జితంతో జీవితంలో పైకివచ్చినవారు సైతం సైబర్ నేరగాళ్లకు చిక్కారు. ఇంకా వారి ఉచ్చులో పడిపోతూనే ఉన్నారు. స్మార్ట్‌ఫోన్‌తోపాటు సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనలే ఇందుకు కారణం. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆన్‌లైన్ ట్రేడింగ్, ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లు, లోన్ యాప్‌లపై నిరంతరం ప్రకటనలు వస్తున్నాయి. రూ.299తో బెట్టింగ్ ప్రారంభిస్తే.. రూ.2,999 వస్తుందని సైబర్ నేరగాళ్లు నమ్మిస్తున్నారు. ఒక్కరోజులోనే లక్షాధికారి కావొచ్చని ఆశ చూపుతున్నారు. ఈ క్రమంలో బెట్టింగ్ యాప్‌లకు బానిసై.. ముందు కొంత లాభం అందుకుని.. ఆ తర్వాత క్రమేపీ తమ ఆస్తులను సైతం పోగొట్టుకుంటున్నారు. జిల్లాలో ఇటువంటి ఉదంతాలే అధికంగా జరిగాయి. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, ఆటోడ్రైవర్లు, ఉపాధ్యాయులు. ప్రైవేటు ఉద్యోగులు, ఇంటర్, డిగ్రీ విద్యార్థులు, గృహిణులు సైతం సైబర్ నేరగాళ్ల ఉచులో పడి ఆర్థికంగా మోసపోతున్నారు. కొంతమంది అప్పులపాలై.. అసలు విషయం చెప్పుకోలేక.. మనస్థాపనం చెంది ఆత్మహత్యకు పాల్పడుతున్నారు.

● రుణాల పేరిట బురిడీ..

ప్రజలకు ఒకప్పుడు రుణం కావాలంటే.. వారపు వడ్డీలు ఇచ్చే అనపర్తి రెడ్డిలు లేదా.. స్థానికంగా ఉండే ప్రైవేటు ఫైనాన్స్. ఆపైన ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకుల నుంచి తీసుకునేవారు. ఇప్పుడు విద్యార్థులకు, చిన్నపాటి వ్యాపారం నిర్వహించే వారికి సైతం ఆధార్, పాన్‌కార్డు ఉంటే చాలు.. రుణం ఇస్తామంటూ పలు లోన్‌యాప్‌లు అందుబాటులోకి వచ్చాయి. ఆపై ఆన్‌లైన్ బెట్టింగ్, ఆన్‌లైన్ ట్రేడింగ్, రమ్మీ వంటి యాప్‌లతో రోజుకి కొన్ని గంటల వ్యవధిలోనే లక్షలాది రూపాయలు సంపాదించుకుని కోటీశ్వరులు కావచ్చని ఆశ చూపుతున్నారు సైబర్ మోసగాళ్లు. ఏకంగా ఫోన్‌లోకే స్మార్ట్‌గా బూచోళ్లు ప్రవేశిస్తున్నారు. ముందుగా ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో రూ. వెయ్యి నుంచి రూ.5వేల వరకు బ్యాంకు ఖాతాలో జమచేసి ఆశ కల్పిస్తున్నారు. ఆపై టాస్క్‌లు అంటూ.. యూట్యూబ్‌లో కొన్ని వీడియోలకు ఫైవ్‌స్టార్ రేటింగ్, రివ్యూలు ఇస్తే వాటికి అదనంగా డబ్బులు చెల్లిస్తామని చెబుతున్నారు. ఇంటివద్దనే ఉంటూ వేల రూపాయలు సంపాదించకుంటూ.. ఆపై లక్షలు.. అలాఅలా రూ. కోట్లకు పడగలెత్తవచ్చని ఆన్‌లైన్ ట్రేడింగ్ యాప్‌ల పేరిట అమాయకులకు ఎస్ఎంఎస్‌లు పంపుతూ వలలోకి దించుతున్నారు. పోయేది ఏముందిలే అని రూ.వెయ్యో.. రూ. ఐదువేలో ముందుగా పెట్టుబడి పెట్టి.. అవతల సైబర్‌వాడు ఇచ్చే రెండింతల సొమ్ము తో నమ్మకం ఏర్పడి క్షణాల వ్యవధిలోనే వేల రూపా యలు పెట్టుబడి పెడుతున్నారు. ట్రేడింగ్‌లో డాలర్ లను.. రూపాయలుగా మార్పుచేసుకుని సులభంగా డబ్బులు సంపాదించేందుకు వీలుంటుందని.. ఇందుకు గాను విడతల వారీగా టాస్క్‌లు పూర్తిచేయాలంటూ ఆంక్షలు పెట్టి.. లక్షల్లో అమాయకుల నుంచి గుంజుతున్నారు. ఇదేరీతిన జిల్లాలో ప్రతిరోజూ ఎవరోఒకరు ఎక్కడో ఓచోట సైబర్ నేరగాళ్లకు చిక్కి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు.

ఎన్నో సంఘటనలు..

● శ్రీకాకుళంలోని బలగ ప్రాంతానికి చెందిన ఓ ఆటో డ్రైవర్ లోన్‌యాప్‌లు, బెట్టింగ్ యాప్‌లకు అలవాటుపడి.. ఆన్‌లైన్ ట్రేడింగ్‌లలో దూరి.. రూ.25లక్షల వరకు పోగొట్టుకున్నాడు. తెలిసినవారి వద్ద అప్పుచేసి.. పోయిన సొమ్మును ఎలా అయినా సరే రాబట్టుకునేందుకుగాను మళ్లీ ఆన్‌లైన్ ట్రేడింగ్ వేర్వేరు టెలిగ్రామ్ ఛానల్స్‌లో డబ్బులు డిపాజిట్ చేసి.. నిండా మునిగిపోయాడు. అప్పుల బాధలు భరించలేక.. విషయాన్ని బయటకు చెప్పుకోలేక పరారీ అయ్యాడు.

● శ్రీకాకుళం సమీపంలో ఉండే ఓ వ్యయసాయ శాస్త్రవేత్త బ్యాంకు ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు.. రూ.14 లక్షలు దోచుకున్నారు.

● టెక్కలిలో బర్మాకాలనీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఒకరు వర్క్ ఫ్రం హోంలో భాగంగా ఇంటివద్దనే ఉంటూ ఆన్‌లైన్ ట్రేడింగ్‌కు చిక్కాడు. కొద్దిమొత్తం పెట్టుబడితో అధిక లాభాలన్న మెసేజ్‌లకు స్పందించి ఏకంగా రూ.10 లక్షలు వరకు డిపాజిట్ చేసి నష్టపోయాడు.

● నరసన్నపేటకు చెందిన ప్రైవేటు ఉద్యోగి ఒకరు కేవలం రూ.వెయ్యితో ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో చేరాడు. రూ.15వేలు లాభం లభించింది. దీంతో నేరగాళ్ల వేసిన ఎరకు చిక్కి రూ.40 లక్షలు పోగొట్టుకున్నాడు.

● శ్రీకాకుళంలో ఓ సచివాలయ ఉద్యోగి రూ.5 వేలతో ఆన్‌లైన్‌లో ట్రేడింగ్ ప్రారంభించాడు. పెట్టిన పెట్టుబడికి లాభం లభించడంతో విడతలవారీగా ఏకంగా రూ.40 లక్షలు వరకు సైబర్‌నేరగాళ్లు చెప్పినట్లుగా డిపాజిట్ చేస్తూనే ఉన్నాడు. రూ.లక్షలు చెల్లిస్తున్నా.. రకరకాల ఎర్రర్స్ వస్తున్నాయని.. ఇంకొత్త మొత్తం జమచేస్తే రెట్టింపు డబ్బులు అకౌంట్‌లో జమవుతాయని.. తామేమీ మోసం చేయట్లేదని.. దేవునిపై ప్రమాణం చేస్తున్నామంటూ సైబర్ దొంగలు నమ్మించి అతడివద్ద డబ్బులు దోచేసుకున్నారు. అంతకుమించి డబ్బులు అప్పు లభించకపోవడంతో.. మోసపోయానని గ్రహించిన సచివాలయ ఉద్యోగి లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించారు.



ఫిర్యాదు చేయండి

సామాన్యులను రకరకాల మార్గాల్లో మోసగించేందుకు సైబర్ నేరగాళ్లు ప్రయత్నిస్తూనే ఉంటారు. తెలియని వ్యక్తులు ఇచ్చిన ప్రకటనలపై స్పందించ వద్దు. రెట్టింపు లాభం.. ఆన్‌లైన్ ట్రేడింగ్, బెట్టింగ్ యాప్‌లు, లోన్‌యాప్‌ల జోలికి ఎవరూ వెళ్లొద్దు. స్మార్ట్‌ఫోన్‌లకు వచ్చే ఏపీకే ఫైల్స్‌ను, ఇతర లింక్స్‌ను క్లిక్ చేయవద్దు. సైబర్ మోసానికి గురైతే వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 1930కు కాల్‌చేసి ఫిర్యాదు చేయాలి. నేషనల్ సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్ వెబ్‌సైట్‌లో కూడా ఫిర్యాదు చేయవచ్చు. ప్రతిఒక్కరు అప్రమత్తంగా ఉండాలి. స్మార్ట్‌ఫోన్‌లో, సోషల్‌మీడియాలో వస్తున్న ప్రకటనలు.. అన్‌నోన్ మెసేజ్‌లకు ఎట్టి పరిస్థితుల్లోనూ స్పందించొద్దు.

- వై.శృతి, డీఎస్పీ, శ్రీకాకుళం

● శ్రీకాకుళంలోని పీఎన్‌కాలనీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగ దంపతులు ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో చేరి.. రూ.60లక్షలు పోగొట్టుకున్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. జిల్లాలో ఇటువంటి ఘటనలు కోకొల్లలుగా ఉన్నాయి.



వేంకటేశ్వరాలయం

శ్రీ వేంకటేశ్వర ఆలయంలో చోరీ

● వెండి ఆభరణాలు.. నగదు అపహరణ

పాతపట్నం, జూన్ 28: పాతపట్నంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయ తాళాలు, హుండీలు పగలగొట్టారు. బీరువాలో భద్రపరిచిన వెండి ఆభరణాలతోపాటు హుండీలో నగదు దోచుకెళ్లారు. శుక్రవారం ఉదయం అర్చకులు శ్రీనివాసరావు వచ్చి చూడగా.. ఆలయం గేట్లు పగులగొట్టి ఉండడం చూసి షాక్ అయ్యారు. బీరువా, హుండీలు చెల్లాచెదురుగా ఉండడంతో చోరీ జరిగినట్టు గుర్తించి.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. బీరువాలో భద్రపరిచిన శఠగోపాలు-2, పాదాలు -2జతలు, పంచపాత్రలు-5, పెద్ద పంచపాత్ర-1, ఉద్ధరణలు, హారతికుందులు తదితర వెండి సామగ్రి చోరీకి గురైందని తెలిపారు. కేజీకి పైగా వెండి ఆభరణాలతోపాటు హుండీలోని సుమారు రూ.50వేల వరకు నగదు దొంగలు అపహరించారని పేర్కొన్నారు. ఘటనా స్థలాన్ని సీఐ నల్లి సాయి పోలీసు సిబ్బందితో కలిసి పరిశీలించారు. సీసీ ఫుటేజీలు స్వాధీనం చేసుకున్నారు. ఆలయ అర్చకులు శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ నల్లి సాయి తెలిపారు.

ఆర్జీయూకేటీ క్యాంపస్‌లలో ప్రవేశాలకు షెడ్యూల్

ఎచ్చెర్ల, జూన్ 28: రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ పరిధిలోని నాలుగు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌ల్లో ఇంజనీరింగ్ కోర్సులో ప్రవేశానికి షెడ్యూల్ విడుదలైనట్టు శ్రీకాకుళం క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కేవీజీడీ బాలాజీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 'ఈ నెల 25తో దరఖాస్తు ప్రక్రియ ముగిసింది. ప్రభుత్వ పాఠశాలల నుంచి 34,154 మంది, ప్రైవేటు పాఠశాలల నుంచి 19,671మంది, ఇతర రాష్ట్రాల నుంచి 38 మంది మొత్తం 53,863 మంది విద్యార్థులు దరఖాస్తు చేశారు. వీరిలో 30,857 మంది బాలికలు, 23,006మంది బాలురు ఉన్నారు. ఎంపికైన అభ్యర్థుల జాబితాను వచ్చే నెల 11న వెల్లడిస్తాం. ఏ క్యాంపస్‌కు ఎంపికైన విద్యార్థులకు అదే క్యాంపస్‌లో నిర్దేశించిన తేదీల్లో సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుంది. శ్రీకాకుళం క్యాంపస్‌లో జూలై 26,27 తేదీల్లో, నూజివీడు, ఆర్కే వ్యాలీ(ఇడుపులపాయ) క్యాంపస్‌ల్లో జూలై 22,23 తేదీల్లో, ఒంగోలు క్యాంపస్‌లో జూలై 24,25 తేదీల్లో సర్టిఫికెట్లు పరిశీలిస్తారు. ప్రత్యేక కేటగిరీ కింద దరఖాస్తు చేసిన అభ్యర్థులకు సంబంధించి వచ్చే నెల 1 నుంచి 5 వరకు నూజివీడు క్యాంపస్‌లో సర్టిఫికెట్లు పరిశీలిస్తా'రని బాలాజీ వెల్లడించారు.

బైక్‌పై వచ్చి.. డబ్బులు ఎత్తుకెళ్లి..

● జీడి వ్యాపారుల వద్ద రూ.18.50లక్షల చోరీ
● వ్యాన్ డ్రైవరే అసలు సూత్రధారి
● నిందితులను పట్టించిన సీసీ ఫుటేజీ



డీఎస్పీ కార్యాలయం బయట వేచి ఉన్న జీడిపిక్కల వ్యాపారులు

టెక్కలి, జూన్ 28: పలాసకు చెందిన ఇద్దరు వ్యాపారులు.. జీడిపిక్కల కొనుగోలు కోసం ఓ అద్దె వ్యాన్‌లో సరుబుజ్జిలి బయలుదేరారు. వ్యాన్ డ్రైవర్ పథకం ప్రకారం.. మార్గమధ్యలో మరో ఇద్దరి సహకారంతో వ్యాపారుల వద్ద ఉన్న రూ.18.50 లక్షల నగదును కాజేశాడు. దీనిపై వ్యాపారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వ్యాన్‌డ్రైవర్‌తోపాటు మరో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 18 గంటల్లోనే కేసును చేధించారు. వివరాల్లోకి వెళితే.. పలాస ప్రాంతానికి చెందిన తంగుడు జయరాం రూ.14.50లక్షలు, బత్తుల దివాకర్ రూ.4లక్షల నగదుతో జీడిపిక్కలు కొనుగోలు కోసం గురువారం ఉదయం ఓ అద్దె వ్యాన్‌లో సరుబుజ్జిలి ప్రాంతానికి బయలుదేరారు. మార్గమధ్యలో కోటబొమ్మాళి మండలం తర్లిపేట వద్ద 7.30గంటల సమయంలో డ్రైవర్ కె.జగదీశ్వరరావుతో కలిసి టిఫిన్ చేసేందుకు వ్యాన్ నిలిపారు. అదే సమయంలో ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి వ్యాన్‌లో ఉన్న రూ.18.50లక్షల నగదును అపహరించారు. పలాస వైపు ఉడాయించారు. కాగా.. వ్యాపారులు టిఫిన్ చేసిన తర్వాత వ్యాన్ ఎక్కి చూడగా నగదు కనిపించలేదు. వ్యాన్‌డ్రైవర్ జగదీశ్వరరావు కూడా తనకేమీ తెలియనట్టు వ్యవహరించాడు. దీంతో వెంటనే జయరాం, దివాకర్ కోటబొమ్మాళి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అప్రమత్తమై అన్నివైపులా నిఘా వేసి సీసీ ఫుటేజీలు పరిశీలించారు. పలాస సమీపంలో లక్ష్మిపురం టోల్‌గేట్ వద్ద ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంపై ఓ సంచితో వెళ్తున్నట్లు గుర్తించారు. డీఎస్పీ బాలచంద్రారెడ్డి, కోటబొమ్మాళి ఎస్ఐ షేక్‌మహ్మద్ ఆలీ, క్రైమ్ పోలీసులు గురువారం వేకువజామున పలాస ప్రాంతంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న సప్ప సింహాచలంతో పాటు మరొకరిని పట్టుకున్నారు. వారిని టెక్కలి డీఎస్పీ కార్యాలయంలో విచారించగా.. వ్యాన్‌డ్రైవర్ జగదీశ్వరరావు పథకం ప్రకారమే చోరీకి పాల్పడినట్టు తేలింది. డ్రైవర్ సమాచారం మేరకు వారిద్దరూ ఆ వ్యాన్‌ను ద్విచక్ర వాహనంపై అనుసరించారు. టిఫిన్ చేస్తున్న సమయంలో వ్యాన్‌లో ఉన్న డబ్బులను కాజేసినట్టు అంగీకరించారు. ఈ మేరకు ఆ ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కోటబొమ్మాళి ఎస్ఐ షేక్‌మహ్మద్ ఆలీ తెలిపారు.

● అప్పటి మంత్రి నుంచి సర్వేయర్ వరకూ పాత్రధారులే
● కలెక్టర్‌కు మొర పెట్టుకున్నా ఫలితం లేదు
● న్యాయం చేయాలని బాధితుల వేడుకోలు



పెద్దపాడులో నిర్మిస్తున్న వైసీపీ కార్యాలయం

భూమి కాజేసి.. వైసీపీ ఆఫీసు కట్టేసి..

శ్రీకాకుళం రూరల్/అరసవల్లి, జూన్ 28: ప్రభుత్వ భూములను లీజుకు తీసుకుని కార్యాలయాలు నిర్మించడం పరిపాటి. కానీ వైసీపీ నాయకులు గతంలో ప్రభుత్వ భూములతోపాటు.. విశ్రాంత ఉద్యోగుల స్థలాన్ని కూడా కాజేసి.. పార్టీ కార్యాలయాన్ని నిర్మించేశారు. ఇందులో అప్పటి మంత్రి ధర్మాన ప్రసాదరావు నుంచి.. సర్వేయర్ వరకూ అందరూ పాత్రధారులేనని బాధితులు ఆరోపిస్తున్నారు. అప్పట్లో కలెక్టర్‌కు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే..

శ్రీకాకుళం కార్పొరేషన్ పరిధి పెద్దపాడులో ప్రభుత్వ భూములను వైసీపీ నాయకులు 33 ఏళ్లకు లీజుకు తీసుకుని పార్టీ కార్యాలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఏడాదికి ఎకరాకు రూ.1,500 చొప్పున చెల్లించేలా లీజు రాయించారు. ఇంద్ర భవనాన్ని తలపించేలా కార్యాలయాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికి 80 శాతం మేర పనులు పూర్తయ్యాయి. కాగా.. ఈ భవనం నిర్మాణం వెనుక అక్రమాలు ఒక్కొక్కటీ వెలుగులోకి వస్తున్నాయి. వైసీపీ నాయకులు ప్రభుత్వ భూములు లీజుతోపాటు.. పక్కనే ఉన్న విశ్రాంత ఉద్యోగుల స్థలాన్ని కూడా కబ్జా చేసి కార్యాయాన్ని నిర్మించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. విశ్రాంత ఉద్యోగులైన ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం లే అవుట్‌లో రిజిస్టర్ నెం.155/85లో 300 ప్లాట్లు కలిగిన లే అవుట్ నుంచి సుమారు 27సెంట్ల భూమిని ఆక్రమించారు. అక్కడితో ఆగకుండా లేఅవుట్ మధ్యలో ప్రహరీ నిర్మించారు. 1989లో విశ్రాంత ఉద్యోగులు ఈ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వారి భూములను చూసుకునేందుకు ఈ ఏడాది జనవరిలో వెళ్లగా.. తమ స్థలంలో ప్రహరీతోపాటు వైసీపీ కార్యాలయం నిర్మిస్తున్నట్లు విశ్రాంత ఉద్యోగులు గుర్తించారు. దీంతో బాధితులు అప్పటి మంత్రి ధర్మాన ప్రసాదరావుతోపాటు కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఆర్డీవో, ఎమ్మార్వో, వీఆర్ఓ, సర్వేయర్‌తో సహా అందరినీ కలిసి.. తమ భూమిని తమకు ఇప్పించాలని మొర పెట్టుకున్నారు. తహసీల్దారు కె.వెంకటరావు ఆ భూమిని ప్రభుత్వ స్థలంగా నిర్ధారించి.. తప్పుడు రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని, ఎవరిని అడిగి భూమిని కొన్నారంటూ ఎదురు ప్రశ్నించడంతో బాధితులు అవాక్కయ్యారు. ఈ విషయాన్ని అప్పట్లో మంత్రి ధర్మాన దృష్టికి తీసుకెళ్లినా.. ఇప్పటివరకూ తమకు న్యాయం చేయలేదని బాధితులు గగ్గోలు పెడుతున్నారు. తమ స్థలం.. తమకు అప్పగించేలా.. న్యాయం చేయాలంటూ ప్రస్తుత మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును వేడుకుంటున్నారు.


● పోరాడుతున్నా న్యాయం జరగలేదు..



ఉపాధ్యాయ సంఘం వేసిన అప్రూవల్ లేఅవుట్‌లోని ఐదున్నర సెంట్ల గల ప్లాట్ నెం-238ను 1993లో కొనుగోలు చేశాను. మా కుమార్తె వివాహానికి డబ్బులు అవసరం కాగా.. ఆ స్థలాన్ని విక్రయించాలని భావించాను. గతేడాది సెప్టెంబరులో వచ్చి చూడగా.. వైసీపీ కార్యాలయ నిర్మాణంలో భాగంగా నా స్థలం ఆక్రమణకు గురైందని గుర్తించి అవాక్కయ్యాను. వెంటనే పెద్దపాడు రూరల్ పోలీసుస్టేషనులో దీనిపై ఫిర్యాదు చేశాను. మంత్రి ధర్మానను, కలెక్టర్ శ్రీకేష్‌బాలాజీ లఠ్కర్, జేసీ నవీన్, ఆర్డీవోను, ఎమ్మార్వో వెంకటరావు, సర్వేయర్ రఘును కలిసి మొరపెట్టుకున్నా న్యాయం జరుగలేదు. నా స్థలాన్ని నాకు ఇప్పించేలా మంత్రి అచ్చెన్నాయుడు చొరవచూపాలి.

-జీవీ రమణమూర్తి, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు

అక్రమాలకు బలయ్యాం..



ఉద్యోగ విరమణ తరువాత ఆసరాగా నిలుస్తుందని, నా భార్య దుబ్బ పార్వతి పేరున ఉపాధ్యాయ సంఘం లేఅవుట్‌లో 234 నెంబరు గల ఐదున్నర సెంట్ల విస్తీర్ణం కలిగిన ఫ్లాట్‌ను 1991లో కొనుగోలు చేశాను. నాతోపాటు 300 మంది ఉద్యోగులు ఒకేచోట ఉంటారనే ఆశతో భూమి కొనుక్కున్నాను. నేడు నా భూమిని వైసీపీ కార్యాలయ నిర్మాణం కోసం నాయకులు, అధికారుల అండతో పూర్తిగా కబ్జా చేశారు. వారి అక్రమాలకు బలైపోయాం. ఎవరిని ఆశ్రయించాలో అర్థం కావడంలేదు. న్యాయపోరాటానికి సిద్ధమవుతున్నాం.

-దుబ్బ పాపయ్య, విశ్రాంత ఎస్ఐ

భూమి కబ్జాతో రోడ్డున పడ్డాం..



మా నాన్న రావాడ శ్రీరామ్మూర్తి గిరిజన కార్పొరేషన్‌లో సీనియర్ మేనేజర్‌గా పనిచేసేవారు. అప్పట్లో ఉద్యోగ సంఘం లేఅవుట్‌లో 233 నెంబరు గల ఐదున్నర సెంట్ల ఫ్లాట్‌ను మా అమ్మ రావాడ మణికుమారి పేరిట కొనుగోలు చేశారు. కొన్నాళ్ల కిందట మా నాన్న అనారోగ్యంతో చనిపోయారు. మా కుటుంబానికి ఆసరాగా ఉంటుందనుకున్న భూమి కబ్జాకు గురి కావడంతో రోడ్డున పడ్డాం. గతంలో అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగినా న్యాయం చేయలేదు. ప్రస్తుత పాలకులైనా మాకు అండగా నిలిచి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

-రావాడ రవికుమార్, రాజు

సివిల్ సప్లై డీటీ ఆత్మహత్య

శ్రీకాకుళం క్రైం: శ్రీకాకుళం సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ (డీటీ) రొక్కం శ్రీనివాసరావు(43) శుక్రవారం ఉదయం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కోటబొమ్మాళి మండలం నీలంపేట గ్రామానికి చెందిన శ్రీనివాసరావు శ్రీకాకుళంలోని డీసీసీబీ కాలనీలో భార్య నళిని, ఏడేళ్ల కుమార్తెతో నివాసం ఉంటున్నారు. కొన్నేళ్లుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. శుక్రవారం ఉదయం నళిని తమ కుమార్తెను స్కూల్‌లో దింపేందుకు వెళ్లింది. ఆమె తిరిగి ఇంటికి వచ్చేసరికి శ్రీనివాసరావు ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ వాసుదేవరావు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్(రిమ్స్)కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

మరో నలుగురు విద్యార్థులకు అస్వస్థత

- హాస్టల్‌ను పరిశీలించిన డీఎంహెచ్‌వో మీనాక్షి
- ఆహార పదార్థాలను తనిఖీ చేసిన కల్తీ నియంత్రణాధికారి


హాస్టల్‌లో విద్యార్థుల ఆరోగ్యంపై ఆరా తీస్తున్న డీఎంహెచ్‌వో మీనాక్షి

అరసవల్లి/ శ్రీకాకుళం అర్బన్: నగరంలోని బలగ ప్రాంతంలో గల గిరిజన సంక్షేమ వసతిగృహంలో కలుషిత ఆహారం తిని తొమ్మిది మంది విద్యార్థులు గురువారం అస్వస్థతకు గురై రిమ్స్‌లో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. అయితే అదే వసతి గృహానికి చెందిన మరో నలుగురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న డీఎంహెచ్‌వో బి.మీనాక్షి శుక్రవారం ఉదయం జిల్లా మలేరియా అధికారి పీవీ సత్యనారాయణ, డాక్టర్ సుజాతతో కలిసి వసతి గృహాన్ని సందర్శించి వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. వీరిలో నలుగురు విద్యార్థులు తీవ్ర జ్వరంతో బాధపడుతున్నట్టు గుర్తించి చికిత్స కోసం రిమ్స్‌కు తరలించారు. అనంతరం జిల్లా ఆహార కల్తీ నియంత్రణాధికారి వెంకటరత్నంతో హాస్టల్లో ఆహార పదార్థాలను తనిఖీ చేయించారు. కొన్ని ఆహార పదార్థాల శాంపిల్స్‌ను పరీక్షల నిమిత్తం సేకరించారు. హాస్టల్ పరిసరాలు మురుగునీరు చేరడాన్ని గమనించిన డీఎంహెచ్‌వో మున్సిపల్ హెల్త్ అధికారితో మాట్లాడి.. హాస్టల్ పరిసర ప్రాంతాలను శుభ్రం చేయించారు. నీటి నిల్వలు తొలగించి, బ్లీచింగ్ చల్లించారు. విద్యార్థులకు తాగునీటిని అందించే వాటర్ ట్యాంకులను శుభ్రం చేయించారు. విద్యార్థులకు పౌష్టికాహారంతోపాటు కాచి వడగట్టిన నీటిని అందించాలని హాస్టల్ అధికారులకు సూచించారు. బయట ఆహారం విద్యార్థులు తీసుకోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం రిమ్స్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థుల ఆరోగ్యంపై ఆరా తీశారు.

తలనీలాల వేలంపాట వాయిదా


వేలంపాట నిర్వహిస్తున్న దృశ్యం


అరసవల్లి: ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్య నారాయణ స్వామి దేవస్థానంలో ఐదోసారి తలనీలాలు టెంటర్ కమ్ బహిరంగ వేలంపాట నిర్వహించగా, గతేడాది (రూ.91 లక్షల) కంటే తక్కువ నమోదు కావడం వల్ల వాయిదా వేసినట్టు ఆలయ ఈవో ఎస్.చంద్రశేఖర్ తెలిపారు. అలాగే ఇంతవరకు పోగు చేసిన తలనీలాలు స్టాక్ కోసం నిర్వహించిన వేలం పాటకు పాటదారులు ఆసక్తి చూపకపోవడం వల్ల వాయిదా వేశామని తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, శ్రీకూర్మ ఈవో జి.గురునాథం పాల్గొన్నారు.

విధుల్లోకి తీసుకోవాలని మాజీ వలంటీర్ల వినతి


వినతి పత్రాన్ని అందిస్తున్న మాజీ వలంటీర్లు, విద్యుత్ రీడర్స్


ఇచ్ఛాపురం: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ నాయకులు బలవంతంగా మాపై ఒత్తిడి తెచ్చి రాజీనామాలు చేయించారని, అందువల్ల మళ్లీ తమను విధుల్లోకి తీసుకోవాలని వార్డు మాజీ వలంటీర్లు జనసేన పార్టీ ఇన్‌చార్జి దాసరి రాజును కోరారు. ఈమేరకు శుక్రవారం పార్టీ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. వీరితో పాటు విద్యుత్ మీటర్ రీడర్స్ అసోసియేషన్ సభ్యులు కూడా తమ సమస్యలు పరిష్కరించేలా కృషి చేయాలని కోరారు. గతంలో టీడీపీ హయాంలో నెలరోజులు పని కల్పించేలా జీవో విడుదల చేసిందని, తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ జీవోను రద్దు చేసిందని గుర్తు చేశారు. వైసీపీ కాంట్రాక్టర్లు దోపిడీకి పాల్పడి కక్ష సాధింపు చర్యలకు పాల్పడి పని దినాలను తగ్గిస్తూ మా కడుపులు కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. మా సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు.

సీపీఆర్‌పై అవగాహన


సీపీఆర్ చేయడంపై వివరిస్తున్న వైద్యుడు సంతోష్

ఇచ్ఛాపురం: గుండెపోటుకు గురైన వెంటనే ప్రథమ చికిత్సలో భాగంగా సీఆర్‌పీ చేయడం ద్వారా ప్రమాదం నుంచి బయట పడవచ్చునని ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు వెచ్చా సంతోష్ అన్నారు. శుక్రవారం స్థానిక జేసీఐ క్లబ్ ఆధ్వర్యంలో కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. కరోనా తర్వాత ఎక్కువ మంది గుండెపోటు గురై మృతి చెందుతున్నారన్నారు. దీనిని అధిగమించేందుకు సీపీఆర్ ద్వారా ప్రాణాలు కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు షణ్ముఖరావు, కార్యదర్శి పవన్ కుమార్, ప్రాజెక్ట్ చైర్మన్ నవీన్, సభ్యులు ఢిల్లేష్, రాజ్‌కుమార్, టీడీపీ నాయకులు కాళ్ల జయదేవ్, ప్రిన్సిపాల్ పి.శిరీష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వసతిగృహ విద్యార్థులకు వైద్య పరీక్షలు


విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

సోంపేట: పట్టణంలోని బాలికల వసతి గృహంలో రోటరీక్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా అవసరమైన విద్యార్థులకు ఉచితంగా మందులు అందజేవారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు దుద్ది శ్రీనివాసరావు, కార్యదర్శి పీవీ కృష్ణారావు, కోశాధికారి కె.రవికుమార్ తదితరులు ఉన్నారు.

ఎలా వెళ్లేది?

- చింతాడలో రోడ్లపైకి మురుగు నీరు
- రాకపోకలకు అవస్థలుపడుతున్న గ్రామస్థులు
- పట్టించుకోని యంత్రాంగం


ఎస్సీ కాలనీకి వెళ్లే రోడ్డుపై చేరిన మురుగునీరు


కాలువను తలపిస్తున్న యాళ్లవీధిలోని రోడ్డు

శ్రీకాకుళం అర్బన్: పేరుకే అభివృద్ధి చెందిన గ్రామం అది.. ఆ గ్రామంలో ఏ మూల చూసినా, ఏ వీధిలోకి వెళ్లినా మురుగు నీరే స్వాగతం పలుకుతుంది. గడిచిన ఐదేళ్లలో వైసీపీ నాయకులు ఒక్క రోడ్డు కాదు కదా... కాలువ కూడా నిర్మించిన పాపాన పోలేదు. దీంతో ఆ గ్రామంలో కాలువలు లేక మురుగు నీరు రోడ్లపై పారుతోంది. రోడ్డేదో.. కాలువేదో తెలియని పరిస్థితి నెలకొంది. శ్రీకాకుళం రూరల్ మండలం చింతాడ గ్రామస్థులు అధ్వాన పరిస్థితుల నడుమ కొట్టుమిట్టాడుతున్నారు. ఈ గ్రామం ఆమదాలవలస మున్సిపాల్టీ పరిధిలో ఉన్నా ఎటువంటి అభివృద్ధి జరగపోవడం గమనార్హం. దీంతో ఆ గ్రామ ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పిల్లలు సైతం బడికి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇప్పుడు రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావడంతో మళ్లీ తమ గ్రామం అభివృద్ధి చెందుతుందని ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఇంటింటికీ తాగునీరు అందిస్తా: ఎమ్మెల్యే ఎన్ఈఆర్


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎన్ఈఆర్

లావేరు: ఎచ్చెర్ల నియోజకవర్గం లోని ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తామని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) అన్నారు. శుక్రవారం వెంకటాపురం నుంచి అదపాక వరకు రూ 3.17 కోట్ల నిధులతో 7.6 కిలోమీటర్ల మేరా నిర్మాణం చేపట్టనున్న బీటీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. దశల వారీగా నియోజకవర్గంలోని ప్రతీ గ్రామానికి బీటీ రోడ్లు నిర్మాణాలు చేపడతామని చెప్పారు. సీఎం చంద్రబాబు అంటేనే అభివృద్ధికి చిరునామాగా చెప్పుకోవచ్చునన్నారు. ప్రధాని మోదీ సహకారంతో నియోజకవర్గంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతానన్నారు. తోటపల్లి కాలువ పనులు నిలిచి పోయిన నుంచి సొంత నిధులు వెచ్చించి పూర్తి చేయిస్తానన్నారు. బుడుమూరు నారాయణసాగర్‌ను, ఎస్ఎం పురం పెద్ద చెరువును మినీ రిజర్వాయర్లుగా అభివృద్ధి చేయిస్తానని తెలిపారు. నిరుద్యోగ యువతకు స్థానిక పరిశ్రమల్లో ఉద్యోగాలు వేయిస్తామన్నారు. ఎచ్చెర్లను ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతానన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను స్థానిక ప్రజా ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. అనంతరం లావేరు జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించి, విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో పీర్ డీఈ సీతంన్నాయుడు, ఏఈ అప్పన్న, ఎంపీడీవో కొండలరావు, కూటమి నాయకులు విశ్వక్షేన్, ముప్పిడి సురేష్, ఇజ్జాడ శ్రీనివాసరావు, గంట్యాడ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కాలువ మరమ్మతు పనులు ప్రారంభం

రణస్థలం: తోటపల్లి కాలువ మరమ్మతు పనులను శుక్రవారం ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ప్రారంభించారు. గత నాలుగేళ్లుగా తోటపల్లి నీరు అందకపోవడంతో రైతులు పడుతున్న కష్టాలను స్థానిక ఎమ్మెల్యే ఎన్ఈఆర్ దృష్టికి పలువురు తీసుకెళ్లారు. దీంతో ఆయన స్పందించి సంబంధిత అధికారులు డీఈ హరిప్రసాద్, జేఈ రామలక్ష్మితో మాట్లాడి, 12వ నెంబరు కిలోమీటర్ నుంచి కాలువ పనులను ప్రారంభించారు. మూడు కిలోమీటర్ల పరిధిలో పూడిక పనులు పూర్తయిన వెంటనే సాగునీరు ఇవ్వాలని సంబంధిత అధికారులను సూచించారు. ఎమ్మెల్యే వెంట ముప్పిడి సరేష్, పిషని జగన్నాథంనాయుడు, పిన్నింటి భాను తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన విశ్వబ్రాహ్మణులు


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘ ప్రతినిధులు

ఇచ్ఛాపురం: మూడో సారి ఎమ్మెల్యేగా గెలుపొందిన బెందాళం అశోక్‌కు విశ్వబ్రాహ్మణ సంఘ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. శుక్రవారం తన నివాసంలో కలిసి పూలగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్ష, కార్యదర్శులు కొర్లాపు ప్రకాష్ ఆచారి, రాయల బైరాచారి, బందారు కుమర్‌స్వామి, బండార రామారావు పాల్గొన్నారు.

ఆక్రమణల బడ్డీలు తొలగింపు


బడ్డీలు తొలగిస్తున్న దృశ్యం

ఆమదాలవలస: పట్టణం నడిబొడ్డున ఉన్న కూరగాయల మార్కెట్ ముందు భాగంలో గత వైసీపీ ప్రభుత్వంలో అక్రమంగా వెలిసిన బడ్డీలను గురువారం రాత్రి నుంచి శుక్రవారం సాయంత్రం వరకు మున్సిపల్ అధికారులు తొలగించారు. ఏడాది కిందట అప్పటి వైసీపీ ప్రభుత్వ పెద్దలు తమ అనుచరులకు 16వ వార్డు పరిధిలో ఉన్న కూరగా యల మార్కెట్ ముందు భాగంలో ఐదు దుకాణాలను ఏర్పాటు చేసుకొనేందుకు మున్సిపల్ అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి అనుమతులు ఇప్పించారు. దీనిపై అప్పట్లో టీడీపీ, బీజేపీ నేతలు మున్సిపల్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఇటీవల కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎమ్మెల్యే కూన రవికుమార్ మున్సిపల్ అధికారులతో సమీక్షించి, ఈ బడ్డీలను తొలగించాలని అధికారులను ఆదేశించడంతో గురువారం రాత్రి వాటిని మున్సిపల్ అధికారులు తొలగించి వేరే చోటకు తరలించారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడేందుకు కృషి చేస్తున్న ఎమ్మెల్యే కూన రవికుమార్ చర్యలపై పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో పట్టణ శివారులో ఉన్న చాలా ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యాయని, బినామీల పేరిట పట్టాలు మంజూరయ్యాని, వాటిపై విచారణ చేసి ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అక్రమ కట్టడాలు కూల్చివేయాలి


అక్రమకట్టడాలను పరిశీలిస్తున్న శ్రీనివాసానంద

పొందూరు: పవిత్రమైన తిరుమల క్షేత్రంలో వ్యాపారధోరణితో గత ప్రభుత్వ హయాంలో అనుమతులు లేకుండా శారదాపీఠం నిర్వాహకులు స్వామీ స్వరూపానంద చేపట్టిన అక్రమ నిర్మాణాలపై విచారణ చేపట్టి కూల్చివేయాలని కృష్ణాపు రం ఆనందాశ్రమ పీఠాధిపతి, సాధుపరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసానంద డిమాండ్ చేశారు. తిరుమల క్షేత్రంలో శుక్రవారం అక్రమ నిర్మాణాలపై నిరసన చేపట్టారు. అనంతరం స్వరూపానంద అక్రమ కట్టడాలను పరిశీలించారు.

మలేరియా నివారణకు చర్యలు

సరుబుజ్జిలి: మలేరియా నివారణకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా మలేరియా అధికారి పీవీ సత్యనారాయణ తెలిపారు. మండలంలోని వెన్నెలవలస వద్ద ఉన్న జవహర్ నవోదయ విద్యాలయంలో దోమల నివారణ మందు పిచికారీని శుక్రవారం పరిశీలించారు. ఈ ద్రావణాన్ని విద్యాలయంలో ఉన్న 65 గదుల్లో స్ప్రే చేయించారు. ఈయన వెంట స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి సంతోష్‌కుమార్, సీహెచ్‌వో మోహన్‌రావు, సబ్ యూనిట్ అధికారి ఆచారి, సూపర్‌వైజర్ శ్రీనివాస్, ఏఎన్ఎం ఈశ్వరమ్మ, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి: తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించాలని గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులను ఎమ్మెల్యే గొండు శంకర్ ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికీ కొళాయి సదుపాయం కల్పించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. శుక్రవారం స్థానిక నీటి సరఫరా విభాగం కార్యాలయంలో అధికారులతో ఎమ్మెల్యే శంకర్ సమీక్ష నిర్వహించారు. తాగునీటి సరఫరాలో తలెత్తుతున్న సమస్యలపై చర్చించారు. మరమ్మతులకు సంబంధించి నివేదికలు ఇస్తే.. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరు చేయిస్తానన్నారు. తాగునీటి సమస్యతో నియోజకవర్గ ప్రజలు ఇబ్బందిపడే పరిస్థితి ఉండకూడదన్నారు. ఈ సందర్భంగా తన దృష్టికి వచ్చిన పలు సమస్యలను అధికారులకు వివరించి పరిష్కరించాలని కోరారు. వచ్చే వేసవి నాటికి రూరల్ ప్రాంతంలో నీటి ఎద్దడి లేకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో గ్రామీణ నీటి సరఫరా విభాగం ఎస్ఈ జాన్ బెన్‌హర్, డీఈలు సీహెచ్ రామారావు, పి.శంకరరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉత్తమ విద్య

ఇచ్ఛాపురం: ప్రభుత్వ పాఠశాలల ద్వారా ఉత్తమ విద్య సాధ్యమవుతుందని బెల్లుపడ 13వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి రెయ్యి జానికిరావు అన్నారు. శుక్రవారం బెల్లుపడ పాఠశాలలో విద్యార్థులకు కిట్లను అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న ప్రతీ విద్యార్థికి ఉచితంగా పుస్తకాలు అందజేయడంతో పాటు యూనిఫారాలు, సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆశి జీవులురెడ్డి, గిరీష్, శ్రీధర్, కూర్మ, రాము, నీలవేణి, గిన్ని చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో పూజలు


పూజలు చేస్తున్న భక్తులు

పొందూరు: లోలుగు గ్రామంలో మూడు రోజులపాటు శివాలయం ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. వేద పండితులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ సతీమణి, మాజీ ఎంపీపీ కూన ప్రమీల తదితరులు పాల్గొని పూజలు చేశారు.

రచ్చబండ స్థల పరిశీలన

ఆమదాలవలస: కొర్లకోట గ్రామంలో రచ్చబండ నిర్మాణానికి శుక్రవారం డీఈ చంద్రశేఖర్ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలన చేపట్టారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలకు ముందు శ్రీకాకుళం పార్లమెంట్ సభ్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు ఇక్కడ రచ్చబండ నిర్మాణానికి రూ.4.95 లక్షలు మంజూరు చేశారు. ప్రస్తుతం రచ్చబండ నిర్మాణం ఆ గ్రామ పెద్ద సనపల అప్పలనాయుడు పర్యవేక్షణలో ఇంజనీరింగ్ అధికారులు స్థల పరిశీలనతో పాటు పలు సూచనలు చేశారు. జేఈ జ్యోతి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ భార్గవ్ తదితరులు ఈ పరిశీలనలో ఉన్నారు.

ప్రైవేట్ డిగ్రీ కళాశాలల సమస్యలు పరిష్కరించాలి


ప్రిన్సిపల్ కార్యదర్శిని సత్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

ఎచ్చెర్ల: రాష్ట్రంలో ప్రైవేట్ డిగ్రీ కళాశాలల సమస్యలు పరిష్కరించాలని ప్రిన్సిపల్ కార్యదర్శి సౌరభ్ గౌర్‌ను ఆ అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం ఆమరావతిలో కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు కోట మురళీధర్, పొన్నాన జయరాం, బొంతు శ్రీనివాస్, గుండా రెడ్డి, రామ్‌జీ, గుర్రాల వెంకరెడ్డి, విజయ్‌భాస్కర్ రెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రీ కౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకోవాలి

గుజరాతీపేట: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షల్లో రీ కౌంటింగ్ గాని, రీ వెరిఫికేషన్‌కు గాని వెళ్లాల్సిన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఈవో కె.వెంకటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మే నెలలో జరిగిన అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షల్లో జిల్లా నుంచి 2,218 మంది హాజరు కాగా, 1,338 మంది 60.32 శాతంతో ఉత్తీర్ణులైయ్యారన్నారు. ఫలితాలను వెబ్‌సైట్‌లో పొందపర్చినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు ఈ నెల 27 నుంచి జూలై 1వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రీ కౌంటింగ్‌కు ప్రతి సబ్జెక్టుకు రూ.500, రీ వెరిఫికేషన్‌కు రూ.1000 చెల్లించాల్సి ఉంటుందన్నారు. సీఎఫ్ఎంఎస్ ద్వారా కట్టిన ఫీజు చెల్లుబడి కాదని, దీనిని విద్యార్థులు గమనించాలని కోరారు.

మెగా డీఎస్సీకి ఉచిత శిక్షణ

గుజరాతీపేట: ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసిన మెగా డీఎస్సీ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్టు శ్రీకాకుళం బీసీ స్టడీ సర్కిల్ సంచాలకులు ఇ.అనురాధ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 27వ తేదీ నుంచి దరఖాస్తు చేసుకునే ప్రక్రియ ప్రారంభమయిందని, ఆసక్తి గల అభ్యర్థులు శ్రీకాకుళం నగరంలోని 80 ఫీట్ రోడ్‌లో గల బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో నేరుగా దరఖాస్తు చేసుకోవాలని, జూలై 5వ తేదీ నుంచి ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో గల గిరిజన భవన్‌లో శిక్షణా తరగతులు ప్రారంభమవుతాయన్నారు. రిజర్వేషన్ ప్రాతిపదికన అర్హత కలిగిన అభ్యర్థులకు 60 రోజులపాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. శిక్షణా కాలంలో 75 శాతం హాజరు కలిగిన అభ్యర్థులకు రూ.1500 స్టైఫండ్, పుస్తకాల అలెవెన్స్ రూ.1000 ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ జెరాక్స్ కుల, ఆదాయ ధ్రువ పత్రాలు, క్వాలిఫికేషన్ సర్టిఫికేట్లలతో హాజరు కావాలని కోరారు.

నేడు మున్సిపల్ సమావేశం

ఇచ్ఛాపురం: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గల కౌన్సిల్ హాల్‌లో శనివారం మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్టు చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధికారులు పూర్తి సమచారంతో రావాలని, వార్డు కౌన్సిలర్లు హాజరు కావాలని కోరారు. అజెండాలో పొందిపరిచిన ఎనిమిది అంశాలపై చర్చించనున్నట్టు తెలిపారు.

కాచివడబోసిన నీటినే తాగండి

శ్రీకాకుళం క్రైం: రానున్నది వర్షాకాలం కావడంతో నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న ప్రజలతో పాటు పంచాయతీ పరిధిలో ఉన్న ప్రజలు కాచి వడబోసిన నీటినే తాగాలని ఇన్‌చార్జి కమిషనర్ పీవీ గంగాధర్ శుక్రవారం ఓ ప్రకటనలో పర్కొన్నారు. ఇంటి కొళాయిలు కలిగిన వారు కొళాయి వచ్చినప్పుడు తొలి బిందెడు నీటిని విడిచి పెట్టి, తదుపరి నీరు పట్టుకోవాలని సూచించారు. వర్షాకాలం రానుండడంతో ఇంటిలో, బయట నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని ప్రజలను కోరారు.

అస్వస్థతపై నివేదిక ఇవ్వండి

అరసవల్లి: నగరంలోని బలగ ప్రాంతంలో గల గిరిజన సంక్షేమ వసతి గృహంలోని తొమ్మిది మంది విద్యార్థులు కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురై విషయంపై తక్షణ నివేదిక ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్టు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థుల అస్వస్థతకు బయట తీసుకున్న ఆహారమే కారణమా? లేక హాస్టల్‌లో తయారు చేసిన వంటకాలలో ఏమైనా తేడా ఉందా? సిబ్బంది నిర్లక్ష్యంపైనా పూర్తి సమాచారంతో నివేదిక ఇవ్వాలని ఆదేశించామన్నారు. నివేదిక ఆధారంగా కమిషన్ ద్వారా చట్ట ప్రకారం చర్యలకు ప్రభుత్వానికి సిఫారసు చేస్తామన్నారు.

పీజీ సెట్‌లో 20వ ర్యాంక్


శ్రీజ

ఇచ్ఛాపురం: పట్టణానికి చెందిన తెన్నేటి శ్రీజ పీజీసెట్‌లో 20వ ర్యాంకు సాధించింది. ఇంగ్లీష్ విభాగంలో 78 మార్కులతో సత్తాచాటింది. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసింది. ఈమె తండ్రి తెన్నేటి తేజేశ్వరశర్మ ప్రముఖ వేద పండితులు.

బాధితుడుకి ఆర్థిక సాయం

ఇచ్ఛాపురం: రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోయి ఇంటికే పరిమితమైన పురుషోత్తపురం గ్రామానికి చెందిన గాలి కృష్ణారావుకు కేదారిపురం గల్ఫ్ ఫౌండేషన్ సభ్యులు రూ.10 వేలు సాయాన్ని అందజేశారు. శుక్రవారం బాధితున్ని పరామర్శించి సాయాన్ని అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

బాలలను పనుల్లో పెడితే కేసులు

ఇచ్ఛాపురం: బాలలను పనుల్లో పెడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సీడబ్ల్యూ వీవో గోపాలకృష్ణ, లేబర్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ అన్నారు. బాలకార్మికుల రిస్క్యూ ఆపరేషన్‌లో భాగంగా శుక్రవారం పట్టణంలో గల పలు దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. మార్కెట్, బేకరీ, స్వీట్, కిరాణా, మెకానిక్ గ్యారేజ్‌లను తనిఖీ చేపట్టి యజమానులకు అవగాహన కల్పించారు. చైల్డ్ హెల్ప్‌లైన్ ఎం.స్వాతి, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

సరుబుజ్జిలి: రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో ముమ్మరంగా పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్న దృష్ట్యా గ్రామాల్లో ఎటువంటి అంటువ్యాధులు ప్రబలకుండా పగడ్బందీగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం సరుబుజ్జిలి మండల కేంద్రంలో రహదారులకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్తను జేసీబీ సాయంతో సర్పంచ్ బొడ్డేపల్లి చాందిని వెంకట సూర్య, కార్యదర్శి బి.అనిల్‌కుమార్ తొలగింపు చేపట్టారు.

ఆర్టీసీ బస్సు ప్రారంభం

సరుబుజ్జిలి: యరగాం గ్రామానికి శుక్రవారం ఆర్టీసీ బస్సు ప్రారంభం కావడంపై టీడీపీ యువ నాయకులు గురువు తిరుమలరావు, గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఈ గ్రామం నుంచి ఆమదాలవలస, శ్రీకాకుళం పట్టణాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉండేదని, మా గ్రామంతో పాటు సుమారు 15 గ్రామాలకు రవాణా సౌకర్యం ఉండేది. అయితే గత కొంతకాలం నుంచి ఆర్టీసీ అధికారులు వివిధ కారణాలతో బస్సును నిలుపుదల చేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని ఇటీవల కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే కూన రవికుమార్‌ను కలిసి సమస్య పరిష్కరించగా, వెంటనే స్పందించి బస్సు సౌకర్యం కల్పించడం ఆనందంగా ఉందన్నారు.

అక్రమాలపై విచారణ జరపాలి

పొందూరు: ఎచ్చెర్లలోని అంబేడ్కర్ యూనివర్సిటీ మాజీ ఉపకులపతి నిమ్మ వెంకటరావు చేపట్టిన అడ్డగోలు నియామకాలు, జరిగిన అవినీతి, అక్రమాలపై ప్రభుత్వం విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని అంబేడ్కర్ చైర్ సాధన సమితి కన్వీనర్ టొంపల రమణ డిమాండ్ చేశారు. ధర్మపురం గ్రామంలో శుక్రవారం అంబేడ్కర్ యూనివర్సిటీలో ఎస్సీ, ఎస్టీ, మహిళా, దివ్యాంగులు, మైనార్టీ లా రూల్ ఆఫ్ రిజర్వేషన్లు అమలుకై నిరసన వ్యక్తం చేశారు. ఈ రిజర్వేషన్లు అమలు కోసం జూలై 1 న నిర్వహించనున్న మహాధర్నా విజయవంతం చేయాలని కోరారు. ప్రస్తుత వీసీ కేఆర్ రజని తన వైఖరి మార్చుకోవాలని, మాజీ వీసీ తన రిటైర్‌మెంట్‌కు ముందు చేపట్టిన అడ్డుగోలు ప్రమోషన్లు రద్దుచేయాలని డిమాండ్ చేశారు.

అభివృద్ధికి అవసరమైన రుణం

ఆమదాలవలస: స్వయంశక్తి సంఘాలలో పంచసూత్రాలు పాటిస్తూ ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న సంఘాలకు మైక్రో క్రెడిట్ ప్లాన్ ప్రకారం కావాల్సినంత రుణం మంజూరు చేస్తామని ఆమదాలవలస స్టేట్‌బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ కామేష్ తెలిపారు. శుక్రవారం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో వెలుగు ఏపీఎం పైడి కూర్మారావుతో కలిసి మాట్లాడారు. సమాఖ్య అధ్యక్షురాలు ధనలక్ష్మి, కోఆర్డినేటర్ రమణ పాల్గొన్నారు.

యాలకుల దండతో పూజలు



శ్రీకాకుళం కల్చరల్: సంతోషిమాత ఆలయంలో అర్చకులు మోదుకూరి కిరణ్ శర్మ ఆధ్వర్యంలో శుక్రవారం అమ్మవారికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేసి యాలకుల దండ, వట్టి వేళ్లతో దండ వివిధ రకాల పుష్పాలతో అలంకరణ నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు.

ప్రతి ఎకరాకు సాగునీరందిస్తాం

● నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి



బొద్దాం 18ఆర్ కాలువలో పూడికతీత పనులను కొబ్బరి కాయ కొట్టి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

బొద్దాం(పోలాకి): ఖరీఫ్, రబీలో సాగు చేసే రైతులకు ప్రతి ఎకరాకు సాగునీరందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే బగ్గురమణమూర్తి అన్నారు. శుక్రవారం బొద్దాం నుంచి దండులక్ష్మీపురం కూడలి వరకు ఉన్న 18ఆర్ కాలువ పూడికతీత పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో వంశధార కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలని ఇంజనీర్లను ఆదేశించామన్నారు. కూటమి ప్రభుత్వంలో వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. వంశధార కాలువల్లో నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతున్నామని చెప్పారు. వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా పల్లిపేట వద్ద గుర్రపుడెక్క తొలగిస్తూ ప్రమాదవశాత్తు వెదుళ్ల వలసకు చెందిన ఓ రైతు మృతి చెందినా ఆ కుటుంబానికి పరిహారం ఇవ్వలేదని నాయకులు ఎంవీ నాయుడు, రాంబాబు, యోగి ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు తమ్మినాన భూషణరావు, కరుకోల రమేష్ బాబు, గొర్లె ఎర్రయ్య, పొలిన ప్రసాద్, అన్నాజీరావు, వంశధార ఇంజనీర్లు, రైతులు పాల్గొన్నారు. అనంతరం సుసరాం తంపర ముంపు సమస్యను ఎమ్మెల్యేకు రైతులు వివరించగా ఈ సమస్యను వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుతో చర్చించి శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

జలుమూరు (సారవకోట): ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతతతో పాటు ఆరోగ్యం సిద్ధిస్తుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. చీడిపూడి గ్రామంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ 18వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు ఎమ్మెల్యేకు దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ, నాయకులు బైరి భాస్కరరావు, నిక్కు జనార్దనరావు, బోర ధనుంజయరావు, కింజరాపు రాము, డి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లుగా కుంటుపడిన పట్టణాభివృద్ధి

● పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస, జూన్ 28: ఐదేళ్ల వైసీపీ పాలనలో పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలో అభివృద్ధి కుంటుపడిందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో పట్టణ టీడీపీ నాయకులతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఐదేళ్లలో పాలనను చీకటిమయం చేశారని, పట్టణాభివృద్ధికి కౌన్సిలర్లు, ఇన్‌చార్జిలు చురుగ్గా పనిచేయాలన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు మాట్లాడుతూ.. టిడ్కో గృహాలు సగంలో నిర్మించి నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్లకోసం డీడీలను తీసిన వారికి బలవంతంగా జగనన్న కాలనీలో స్థలాలివ్వడం దారుణమన్నారు. సీనియర్ కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్ మాట్లాడుతూ.. మునిసిపాలిటీ మెప్మా విభాగంలో అవినీతి జరుగుతోందన్నారు. మాజీ వైస్‌చైర్మన్ కోట్ని దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. పట్టణంలో రైతుబజారు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, తాగునీటి సమస్యలు ఉన్నాయన్నారు. టీడీపీ రాష్ట్ర బీసీ సంఘం ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావుయాదవ్ మాట్లాడుతూ.. పారిశుధ్య సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, పరిష్కరించాలని కోరారు. ఈ సమస్యలపై ఎమ్మెల్యే స్పందిస్తూ.. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, అర్హులైన వారికి టిడ్కో గృహాలు, హుద్‌హుద్ ఇళ్లు ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు గాలి కృష్ణారావు, గురిటి సూర్యనారాయణ, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, జోగ మల్లి, టంకాల రవి శంకర్‌గుప్తా, బోను బాబు, డొక్కరి శంకర్, దడియాల నర్సింహులు, కొత్త సత్యం, ఎ.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఒకటినే పింఛన్ల పంపిణీ చేయాలి

జూలై ఒకటో తేదీన పింఛన్లను ప్రతి ఇంటికి వెళ్లి లబ్ధిదారులకు అందించాలని ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. శుక్రవారం సచివాలయాల అడ్మిన్లతో సమావేశం నిర్వహించారు. పెంచిన రూ.4 వేలు పింఛనుతో పాటు పెండింగ్ మొత్తాన్ని కలిపి రూ.7 వేలను అందించాన్నారు. ఎటువంటి ఇబ్బందులున్నా తక్షణం తమను సంప్రదించాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

ఎట్టకేలకు టెక్కలిలో వెలుగు జిలుగులు



సెంటర్ లైటింగ్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

టెక్కలి: ఐదేళ్ల తరువాత డివిజన్ కేంద్రమైన టెక్కలిలోని పాత జాతీయ రహదారి విద్యుత్ వెలుగులతో కళకళలాడుతోంది. సెంటర్ లైటింగ్‌ను శుక్రవారం రాత్రి టీడీపీ మండల అధ్యక్షుడు బగాది శేషగిరిరావు స్విచ్‌ను ఆన్ చేసి వెలిగించారు. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాల మేరకు రూ.20లక్షలతో పాత జాతీయ రహదారి నుంచి జగతిమెట్ట జంక్షన్ వరకు లైట్లు వేసినట్లు తెలిపారు. వైసీపీ హయాంలో సెంటర్ లైటింగ్ దెబ్బతినడంతో మంత్రి ప్రత్యేక చొరవ తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో నేతలు కోళ్ల లవకుమార్, హనుమంతు రామకృష్ణ, మామిడి రాము, మెండ దమయంతి, దోని బుజ్జి, మధుకాన్ శ్రీనివాస్, పోలాకి షణ్ముఖరావు, గురువెల్లి చిన్నమ నాయుడు, పోలాకి చంద్రశేఖర్, రెయ్యి ప్రీతీష్, దల్లి ప్రసాద్ రెడ్డి, బసవల అప్పలస్వామి, గూన సింహాచలం, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

లోకేష్‌ను కలిసిన జడ్పీటీసీ

హిరమండలం: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌ను జడ్పీటీసీ సభ్యుడు పొగిరి బుచ్చిబాబు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. శుక్రవారం మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో కలిసి అభినందించారు. అలాగే టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పల్లా శ్రీనివాసరావు పదవీ స్వీకారోత్సవంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావుతో కలిసి పాల్గొని అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ధనుపురం సర్పంచ్ దారపు డిల్లేశ్వరరావు, చెట్టు శ్రీనివాసరావు, బర్రి సురేష్ తదితరులున్నారు.



మంత్రి లోకేష్‌ను అభినందిస్తున్న జడ్పీటీసీ బుచ్చిబాబు

ఇందిరాగాంధీ కూడలిలో పాము కలకలం

టెక్కలి: ఇందిరాగాంధీ కూడలిలో నివాసాల మధ్య శుక్రవారం భారీపాము కలకలం సృష్టించింది. నివాసాలకు దగ్గరగా ఉన్న ఓ చెట్టుపై భారీ పాము ఉండి చివరకు జనా వాసాల్లోకి రావడంతో స్థానికులు భయాందోళన చెందారు. రెండు గంటల పాటు అదే ప్రాంతంలో తిరగడంతో భయభ్రాంతులకు గురయ్యారు.

పోస్టాఫీసుల్లో అయోధ్య రాముని సావనీర్ విక్రయాలు

టెక్కలి: అయోధ్య రాముని సావనీర్‌ను తమ శాఖ ద్వారా విక్రయిస్తున్నట్లు తపాలాశాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ డీవీఎస్ ప్రతాప్ తెలిపారు. శుక్రవారం తొలి పుస్తకాన్ని బీజేపీ నాయకుడు హనుమంతు ఉదయ్‌భాస్కర్‌కు అందజేశారు. ఒక్కో పుస్తకం రూ.500 అని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల ఆవిష్కరించిన అయోధ్య రామ జన్మభూమి ఆలయానికి సంబంధించిన అన్ని వివరాలు ఇందులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో టెక్కలి హెడ్ పోస్ట్ మాస్టర్ ఎస్.భానుజీరావు పాల్గొన్నారు.



సావనీర్‌ను అందిస్తున్న దృశ్యం

పీజీ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ

టెక్కలి: ఆంధ్రా యూనివర్సిటీ నిర్వహించిన పీజీ పరీక్షల్లో వృక్షశాస్త్ర విభాగంలో టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని లీలాపు రుక్మిణి మొదటి ర్యాంకు సాధించింది. ఈ మేరకు శుక్రవారం కళాశాలలో ఆర్జేడీ ఎస్.శోభారాణి, ప్రిన్సిపాల్ గోవిందమ్మ అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సతీష్‌కుమార్, వి.లూక్‌పాల్, రామారావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



రుక్మిణిని అభినందిస్తున్న ఆర్జేడీ

● **టెక్కలి:** పీజీ సెట్‌లో టెక్కలి విశ్వజ్యోతి డిగ్రీ కళాశాలకు చెందిన బోటనీ విభాగంలో బిడ్డిక నవ్య 8, ముడిదాన నితీష 50వ ర్యాంకు సాధించినట్లు ప్రిన్సిపాల్ పి.జోగారావు తెలిపారు. ఈ మేరకు విద్యార్థినులను ఆయన అభినందించారు.



నవ్య, నితీష

● **పలాస:** ఏపీ పీజీ సెట్‌లో స్థానిక డిగ్రీ కళాశాల విద్యార్థి కుమ్మరి సింహాద్రికి రాష్ట్ర స్థాయిలో 10వ ర్యాంకు వచ్చిందని ప్రిన్సిపాల్ జె.వెంకటలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.



సింహాద్రి

గిరిజన గ్రామాలకు రోడ్ల సదుపాయం కల్పించండి

● కేంద్ర గిరిజన శాఖా మంత్రిని కోరిన యోగి

మెళియాపుట్టి: గిరిజన గ్రామాలకు రోడ్లు లేక రోగులను డోలీలతో తీసుకువెళ్లాల్సి వస్తోందని, రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి కోరారు. ఈ మేరకు శుక్రవారం ఢిల్లీలో కేంద్ర గిరిజన శాఖ మంత్రి జ్వాలాం ఓరంను కలిసి వినతిపత్రం అందజేశారు. నిధులు మంజూరు చేస్తున్నా పనులు సకాలంలో కావడం లేదన్నారు. జిల్లాలో 50 గిరిజన గ్రామాలకు రహదార్లు లేవని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. అలాగే మెళియాపుట్టిలో ఐటీడీఏను ఏర్పాటు చేయాలని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం మెళియా పుట్టి అధ్యక్షుడు గణేష్ తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న వాబ యోగి

వెనుకబడిన పిల్లలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలి

హరిపురం: కేజీబీవీల్లో చదువుతున్న విద్యార్థినుల్లో వెనుకబడిన వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఎంఈవో మర్రిపాటి లక్ష్మణరావు అన్నారు. పీజీపురం కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాన్ని శుక్రవారం పరిశీలించారు. బాలికల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలతోపాటు నాణ్యమైన విద్య అందించాలని సూచించారు. అడ్మిషన్ల ప్రక్రియను పరిశీలించారు. పదోతరగతి విద్యార్థినులతో మాట్లాడి వారి విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. శతశాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎస్‌వో వాసంతిని ఆదేశించారు. వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

'అబద్ధాలాడడంలో మాజీ మంత్రి దిట్ట'

పలాస: అబద్ధాలు అందంగా మాట్లాడడంలో మాజీ మంత్రి అప్పలరాజు దిట్టని టీడీపీ నేతలు అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. మాజీమంత్రి శ్రీకాకుళంలో ఆడిన మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లున్నాయన్నారు. పలాసలో వైసీపీ ఓటమితో ప్రజలు ఆనందంతో ఉన్నారని, భూ కబ్జాలు ఇక ఉండవనే సంతోషాన్ని వారు వ్యక్తం చేస్తున్నారన్నారు. భూ కబ్జాలకు కేరాఫ్ వైసీపీ అని, అప్పటి మంత్రి అప్పలరాజు నుంచి కిందిస్థాయి కార్యకర్త వరకు నియోజకవర్గంలో సెంటు భూమి లేకుండా కబ్జా చేశారని ఆరోపించారు. వీటన్నింటిని ఎమ్మెల్యే గౌతు శిరీష ఆధ్వర్యంలో బహిర్గతం చేస్తామన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు పీరుకట్ల విఠల్‌రావు, గాలి కృష్ణారావు, లొడగల కామేశ్వరరావు యాదవ్, గురిటి సూర్యనారాయణ, సప్ప నవీన్, బడ్డ నాగరాజు, యవ్వారి మోహనరావు, టంకాల రవిశంకర్‌గుప్తా, జోగ మల్లి, డొక్కరి శంకర్, సవర రాంబాబు పాల్గొన్నారు.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడికి అభినందన

పాతపట్నం: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన పల్లా శ్రీనివాస రావును పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అభినందించారు. శుక్ర వారం మంగళగిరిలో శ్రీనివాసరావు పదవీ బాధ్యతలు స్వీకరించిన కార్యక్రమంలో పాల్గొని పుష్పగుచ్ఛం ఇచ్చి సత్కరించారు.



పల్లా శ్రీనివాసరావును అభినందిస్తున్న ఎంజీఆర్

గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలి

నరసన్నపేట: గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టి వ్యాధులు ప్రబలకుండా చూడాలని మండల ప్రత్యేకాధికారి కవిత సూచించారు. శుక్రవారం దేవాది గ్రామంలో పారిశుధ్య పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ, ఏపీవో యుగంధర్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

పలాస: లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం స్థానిక క్లబ్ సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా హెచ్.ఎండుదొర, కార్యదర్శిగా టి.మాధవరావు, కోశాధికారిగా ఎస్.అప్పారావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. లయన్స్ ప్రతినిధులు వి.వర్మ, కేవీ సుబ్బరాజు ఆధ్వర్యంలో ఈ ఎన్నిక ప్రక్రియ చేపట్టారు. అనంతరం నూతన సభ్యులు ప్రమాణం చేశారు. మాజీ ఎంపీ కణితి విశ్వనాథం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

రోడ్డుపై రంధ్రాన్ని పూడ్చరూ!

వజ్రపుకొత్తూరు: మండల పరిధిలోని గల్లి సమీపంలో ఆర్అండ్‌బీ రోడ్డుపై ఏర్పడిన రంధ్రం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి సమయాల్లో రంధ్రం కనిపించకపోవడం వాహన దారులు గాయాలబారిన పడుతున్నారు. ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందించక పోవడంతో ప్రమాద సూచికగా జెండాను ఏర్పాటు చేశామని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని వారు కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన



సామూహిక అక్షరాభ్యాసం నిర్వహిస్తున్న దృశ్యం

హిరమండలం: బడిఈడు పిల్లలు పాఠశాలల్లోనే ఉండాలని ఎంఈవో కె.రాంబాబు అన్నారు. 'నేను బడికిపోతా'లో భాగంగా శుక్రవారం పిండ్రువాడ కాలనీ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యా బోధన అందిస్తున్నామని, పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, మధ్యాహ్న భోజనం ఉచితంగా అందిస్తున్నామని చెప్పారు. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని వారి తల్లిదండ్రులను కోరారు. అనంతరం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

బడిఈడు పిల్లలు బడిలో ఉండాలి

పోలాకి: బడిఈడు పిల్లలు ప్రభుత్వ బడిలోనే ఉండాలని, పనిలో కాదని ఎంఈవోలు శ్రీనివాస నాయక్, టి.లింగరాజు అన్నారు. శుక్రవారం 'నేను బడికిపోతా'లో భాగంగా అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ బడుల్లో నాణ్యత గల విద్యాబోధన జరుగుతోందని పిల్లలకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు బూట్లు, కిట్లు ఉచితంగా పంపిణీ చేస్తోందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడికి పంపాలని సూచించారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల హెచ్‌ఎం లక్ష్మి, విద్యా కమిటీ చైర్మన్ ఎస్.శ్రీనివాసరావు, సీఆర్పీలు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పర్యవేక్షణకు ప్రత్యేకాధికారులు

టెక్కలి, జూన్ 28: మండలాల్లో పారిశుధ్య పనుల పర్యవేక్షణకు ప్రత్యేకాధికారులను నియమించారు. ఈ మేరకు 30 మండలాలకు ప్రత్యేకాధికారులను నియమిస్తూ జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ ఉత్తర్వులు జారీ చేశారు. వీరు గ్రామాల్లో కాలువల్లో పూడికల తొలగింపు, దోమల నియంత్రణకు ఫాగింగ్, రక్షిత నీటి పథకాల్లో క్లోరినేషన్, బోర్ల ప్లాట్‌ఫారాల వద్ద పరిశుభ్రత తదితర కార్యక్రమాలను పర్యవేక్షిస్తారు. వీరు జిల్లా పంచాయతీ అధికారి, ఎంపీడీవో స్థాయి అధికారులతో సమన్వయం చేసుకుంటూ విధులను నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు.

శ్రీకాకుళం డివిజన్..

జలుమూరు మండలానికి జిల్లా అగ్రికల్చర్ ట్రేడ్ మార్కెటింగ్ అధికారి నాగలక్ష్మి జ్యోతి, జి.సిగడాంకి సెట్‌శ్రీ సీఈవో బీవీ ప్రసాదరావు, లావేరుకి బీసీ వెల్ఫేర్ అధికారి ఇ.అనూరాధ, రణస్థలానికి జిల్లా వయోజన విద్య అధికారి ఎం.సుల్తాన్ బేగమ్, ఎచ్చెర్లకి ఏపీఎంఐపీ పీడీ ఆర్.శ్రీనివాసరావు, పొందూరుకు హౌసింగ్ పీడీ నక్క గణపతిరావు, బూర్జ మండలానికి హార్టి కల్చర్ ఏడీ సాయిప్రసాద్‌లను నియమించారు. సరుబుజ్జిలి మండలానికి సీపీవో వీఎస్ ఎల్ ప్రసన్న, ఆమదాలవలసకి డిస్ట్రిక్ట్ హెడ్‌డీఆర్టీ అధికారి ఆర్‌వీ ప్రసాద్, శ్రీకాకుళానికి భూ సర్వే శాఖ ఏడీ ఆర్.విజయ్‌కుమార్, గారకి జీడబ్ల్యూ డీడీ బి.రమణమూర్తి, పోలాకికి ఎస్ఎస్ఏ ఏపీసీ ఆర్.జయప్రకాష్, నరసన్నపేటకి డీడబ్ల్యూ ఏడీ కె.కవితలను నియమించారు.

టెక్కలి డివిజన్..

టెక్కలి మండలానికి జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి కె.సుధ, కోటబొమ్మాళికి బీసీ కార్పొరేషన్ ఈడీ ఆర్.గడ్డెమ్మ, సంతబొమ్మాళికి మత్స్యశాఖ డీడీ టీవీ శ్రీనివాసరావు, ఎల్ఎన్‌పేటకి మెప్మా పీడీ ఎం.కిరణ్‌కుమార్, కొత్తూరుకు ట్రైబల్ వెల్ఫేర్ డీడీ ఎం.అన్నదొర, హిరమండలానికి డిస్ట్రిక్ట్ సెరీకల్చర్ అధికారి టి.రాజేంద్రప్రసాద్ బాబు, సారవకోటకి డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్, పాతపట్నానికి జిల్లా కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్ అజయ్‌కార్తీక్, మెళియాపుట్టికి డ్వామా పీడీ జీవీ చిట్టిరాజులను నియమించారు.

పలాస డివిజన్..

నందిగాం మండలానికి మార్క్‌ఫెడ్ డీఎం కేవీపీ రమణి, వజ్రపుకొత్తూరుకు డీఐసీ జీఎం ఉమామహేశ్వరరావు, పలాసకి వయోజన విద్య డీడీ ఎం.వెంకట రమణ, మందసకి జిల్లా కోఆపరేటివ్ అధికారి ఎస్.సుబ్బారావు, సోంపేటకి మైన్స్, జియాలజీ డీడీ కేవీ సత్యనారాయణ, కంచిలి కి పశుసంవర్ధకశాఖ జేడీ వి.జయరాజ్, కవిటికి జిల్లా ఎస్సీ వెల్ఫేర్ ఎంపవర్‌మెంట్ ఆఫీసర్ వైవీ మోహనరెడ్డి, ఇచ్ఛాపురానికి పీడీ శాంతిశ్రీలను నియమించారు.

నీటి నిల్వలను పెంచాలి

మెళియాపుట్టి: నీటి నిల్వలను పెంచాలని డ్వామా పీడీ చిట్టిరాజు అన్నారు. శుక్రవారం పెద్ద పద్మాపురం పంచాయతీలో రాతికట్టు పనులను పరిశీలించారు. కొండలపై రాక్ పిల్ డ్యామ్‌లు కట్టడం ద్వారా భూగర్భ జలాలు పెంపొందించుకోవచ్చన్నారు. నీటి నిల్వ చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. బోడికొండలో మొక్కల పెంపకానికి ఉన్న అవకాశాలను పరిశీలించారు. చెరువు పనులు తగ్గించి ఇతర పనులు చేపట్టాలన్నారు. కాలువల్లో పూడికతీత పనులను ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అనంతరం పెద్దపద్మాపురం చెత్త సేకరణ కేంద్రాన్ని పరిశీలించారు. ఎంపీడీవో జి.భాస్కరరావు, ఏపీవో టి.రవి, ఈసీ ఆదినాయుడు, కార్యదర్శి చింతల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ

కుల ధ్రువీకరణ పత్రాలకు డ్రైవ్

వజ్రపుకొత్తూరు: కులధ్రువీకరణ పత్రాల కోసం సచివాలయాల్లో డ్రైవ్ చేపడుతున్నట్లు తహసీల్దార్ సురేష్ తెలిపారు. శుక్రవారం వివిధ పంచాయతీల్లోని సచివాల యాలను సందర్శించారు. కులధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలన్న ప్రభుత్వ ఆదేశాలతో వీటిని అందించేందుకు ఎప్పటికప్పుడు వీఆర్వోలకు అవగాహన కలిగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీటీ వి.గిరిరాజు, వీఆర్వోలు పాల్గొన్నారు.

తాగునీటి శ్యాంపిల్ సేకరణ

టెక్కలి: చాకిపల్లి జడ్పీ ఉన్నతపాఠశాలలో పీహెచ్‌సీ పరిధి మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్ కె.పూజాలత తాగునీటి శాంపిల్స్‌ను సేకరించి ల్యాబ్‌కు తరలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జగదీశ్వరరావు, ఉపాధ్యాయులు దాలయ్య, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

సైకిళ్లకు షెడ్లు కరువు



నందిగాం ఉన్నత పాఠశాల ఆవరణలో ఆరుబయటే నిలిపిన సైకిళ్లు

నందిగాం: మండలంలోని ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల సైకిళ్లకు షెడ్లు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నందిగాం, నర్సిపురం, దేవళభద్ర, పెద్దతామరాపల్లి తదితర పాఠశాలల్లో షెడ్లు లేకపోవడంతో ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ పాడవుతున్నాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే గాలి పోవడం, ప్యాచీలు అవుతుండడంతో ఇక్కట్లకు గురవుతున్నామని వాపోతున్నారు. షెడ్లు నిర్మించాలని అధికారులను కోరుతున్నా పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా వారు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

పలాసరూరల్: బొడ్డపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు శుక్రవారం బ్యాగులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెలుగుయువత సభ్యుడు కిక్కర ఢిల్లీరావు, కుమార రాజా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.